కథానిక — ఎ. శ్యామలారాణి



# శ్రీకంఠుడు

**ఆధ్యాత్మికతకి అసలు అర్థం విప్పిచెప్పే నేర్పరి శ్యామలారాణి. అహంకారం, తామసాల మధ్య ఫెళ ఫెళార్భటులతో విరుచుకుపడే పశ్చాత్తాపం మనిషిని మునుపటిలా ఉండనీయదని ఆమె చాటిచెపుతారు.**

"శివోహం.... శివోహం."

"కౌముదీ!"

"ఆఁ.."

"నాన్నగారు కలవరిస్తున్నారా?"

"తెలివి, నిద్ర, కల. అన్ని అవస్థల్లోనూ ఆయన ధ్యాన అదేకదా!"

"ప్చ్!"

"సంతోషించక జాలిపడతారేం?"

"జాలి! ఆయన మీద కాదు కౌముదీ. నేనలా ఉండలేకపోతూన్నందుకు."

"దానికి చాలా సాధన కావాలిలెండి. అంత సులువా? అదో తపస్సు."

కౌముది సన్నెగతాళి చేస్తూందా? అదేలా గుచ్చి గుచ్చి భార్య ముఖంలోకి చూస్తున్నాడు శివనాథ్.

భుజాలు తడుముకుంటున్నారా అన్నట్లున్నాయామె చూపులు. అలవోకగా అందమైన చిరునవ్వు ఆమెకు అనునిత్యం పెట్టని ఆభరణం. ఆ నవ్వు జిలుగుల ముందు తనను తాను మరచిపోతాడు శివనాథ్. 'మంత్రగత్తె' అప్పుడప్పుడు ఆపేక్షగా తిట్టుకుంటాడు.

"ట్రింగ్...ట్రింగ్." ఫోను మోగుతూంది.

"నే చూస్తానుండు." రిసీవరందుకున్నాడు శివనాథ్. కౌముది చూపుల్లో ఆత్రం.

"సారీ. మీరు నా భార్య కౌముదితో మాట్లాడండి." రిసీవర్ ఆమె చేతిలో పెట్టేడు.

నువ్వు మాత్రం ఏం మాట్లాడతావులే అన్నట్లు శివనాథ్ పెదవుల మీద ఎకసక్కెంగా చిన్న నవ్వు.

"ఉఫ్!" కౌముది నిట్టూరుస్తూంది.

"ఏమడుగుతూందావిడ?....పలకవేం? నువ్వు ఉత్తరం రాశావా?"

"రాసేను. మా అబ్బాయి శ్రీచరణ్, మీ అమ్మాయి యశోధర ప్రేమించుకున్నారు. మీరు కూడా అంగీకారం తెలిపితే ఇద్దరూ ఒకటవుతారని రాసేను. లక్ష ప్రశ్నలు వేస్తూందావిడ."

"అబ్బాయి అసలు తల్లెవరు? తండ్రెవరు? కులగోత్రాలేమిటి? మీరు తెలియ జేసిన వెంటనే వచ్చి మాట్లాడతాను. అంతేనా? జవాబేదీ? చెప్పగలవా?...నాకు బాగా తెలుసు కౌముదీ! వీడెవరన్న ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడైనా తలెత్తక మానదని నాకు తెలుసు. అవునూ...అసలు వీడెవరు? అయోనిజుడా? స్వయంభువుడా? దేవుడా? మన దృష్టిలో - సారీ, నీకు, నాన్నగారికి, ఇంకెవరికో వీడు దేవుడు కావచ్చు. కానీ, లోకానికి, నాకు మాత్రం వీడెవరన్నది ప్రశ్నే. ముమ్మాటికీ ప్రశ్నే."

కౌముది పెదవుల మీద ఆభరణంలాంటి చిరునవ్వు ఆమె చూపుల కాఠిన్యం వెనుక క్షణకాలం చిక్కుబడిపోయింది. దానికే శివనాథ్ బెంబేలెత్తి పోయాడు. "అంటే...అంటే...వాడినేదో చిన్నచూపు చూడాలని కాదుసుమా. ఎక్కడ ఎలా పుట్టినా వాడు మన మధ్యే పెరిగాడు. మనలాగే తింటున్నాడు, ఉంటున్నాడు. చదువుకున్నాడు. తెలివైన ఇంజనీర్ అనిపించుకున్నాడు. అన్నీ నరే. ఏదో ఒకనాడు నిజం తెలుసుకోవాలనిపించి 'నే నెవ్వర'ని గట్టిగా వాడిని వాడే ప్రశ్నించుకుంటే కూడా ఏది జవాబు?" ఏదో కటిక సత్యం చెప్పిన గర్వం తొంగిచూసిందతనిలో. "శివోహం....శివోహం." పక్క గదిలోంచి తిరిగి అదే మంత్రోచ్చాటన.

కౌముది చూపుల కాఠిన్యం వెనుక మరుగున పడిపోయిందనుకున్న చిరునవ్వు వజ్రపు తునకలా తిరిగి ప్రత్యక్షం. 'బోధపడిందా?' అని ముదల కిస్తున్నట్లున్నాయా చూపులు. అసహనంగా లేచి పచార్లు ప్రారంభించాడు శివనాథ్. "కౌముదీ! నేనేదైనా తప్పు చేశానంటావా?" పిడుగు పడినట్లుందా మాట. నిండుగా ఉన్న పాలముంతనెవరో అటూ ఇటూ ఊపి ఊపి వదిలేసినట్లు గిజగిజలాడిపోయింది కౌముది.

"తప్పా? మీరా? ఛ. ఏం మాటలండీ అవి?" అపరాధం అన్నట్లుగా చెంపలపైకి పాకుతున్న చేతుల్ని బలవంతాన అదుపులో పెట్టుకుంటూంది.

"మరెందుకు చెప్పు నాకీ శిక్ష?"

"శిక్షా?" "అవును. పెళ్ళిళ్ళు చేసుకోకుండా హాయిగా బతుకుతూన్న వాళ్ళున్నారు. పిల్లలు లేకపోయినా ఆనందంగా జీవితాన్ననుభవిస్తున్న వాళ్ళున్నారు. మనకి పిల్లలు లేరు. ఆల్‌రైట్ - అందువల్ల ఏమిటి నష్టం? వీడిని పెంచుకోకపోతేనే మనం.... సారీ, నేను హాయిగా ఉండేవాడినేమో! అందుకే తప్పు చేశానా అని అడుగుతున్నాను. నాన్నగారి ఆజ్ఞకి తలవంచడం తప్పయిందా అని ఎన్నిమార్లనుకున్నానో తెలుసా?" శివనాథ్‌లోని జీవుడు ఎలా గిలగిల కొట్టు కుంటున్నాడో కౌముదికి కరతలామలకం.

"మీరు తప్పు చేశారనడానికి ఎన్ని గుండెలు కావాలండీ! అయినా, అది తప్పయితే ఆయనలా ఆజ్ఞాపించరు. మీరూ తలవంచరు. ఎందుకండీ పాతికేళ్ళ తర్వాత ఏదేదో తిరగేసుకుని తర్కించి, తర్కించి మనసుని బాధపెట్టుకుంటారు?" శివనాథ్ గాయాలకు సత్వర నివారణ చర్యలు కౌముదికి అలవాటే. "చిత్తక్షోభ భరించలేక."

"మీరు చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్నారు. తండ్రితో ఎప్పుడూ ఆమడ దూరంలో ఉన్నట్టే కనిపిస్తారు. ఆయనకు చేరువైతే హాయిగా ఉండేవారేమో!"

"ఏం చెయ్యను? నాదొక విచిత్రమైన మనస్తత్వం. నాన్నగారిది విశిష్టమైన వ్యక్తిత్వం."

"అది తెలిసినప్పుడు మిమ్మల్ని మీరే ఎందుకు సరిదిద్దుకోరు?" చురుకుగా ఉన్నాయి కౌముది చూపులు.

క్షణంలో కౌముది కొత్తమనిషిలా కనిపించడం ప్రారంభించింది. తన

చిత్రాలు: కె. త్రిశూలపాణి



సహధర్మచారిణిని తానింతవరకూ ఎందుకు పోల్చుకోలేకపోతున్నాడా అని యోచనలో పడ్డాడు శివనాథ్. తనకు అతి సన్నిహితంగా ఉన్నట్లే ఉంటుంది. కీలకమైన నిర్ణయాల్లో తనకేసి చూడదసలు. కౌముది ఆలోచనలింకో రీతిలో సాగుతున్నాయి. ఆమె పెళ్ళి నిశ్చయమైనప్పుడు తండ్రి అన్న మాటలే గుర్తుకొస్తున్నాయి. "నువ్వు శివనాథ్ భార్యవి కాబోతున్నావు అనేకంటే శ్రీకంఠశాస్త్రిగారి కోడలివి కాబోతున్నావని నాకెక్కువ గర్వంగా ఉందమ్మా. ఆయనంటే ఏమిటో తెలుసా?

బంగారు మేనిఛాయ. బ్రహ్మవర్చస్సు ప్రస్ఫుటమయ్యే ముఖమండలం. విశాల ఫాలంపై వెలుగులు విరజిమ్మే విభూతి రేఖలు. మెడలో రుద్రాక్షమాల,



ధవళవస్త్రాలు. కారుణ్యరసం ఉప్పొంగే కనుదోయి. విద్యాతత్త్వార్థ రహస్యాలను ఔపోసనపట్టి అపర శంకరావతారంగా భాసించే శ్రీకంఠశాస్త్రిగారు ప్రజల మనిషి. పదవి లేకపోయినా ఊరికి మకుటం లేని మహరాజు. మూఢాచారాలు, మూర్ఖపు ధోరణులకు స్వస్తి పలికించి మనుషులందరినీ ఏకం చెయ్యటమే ఆయన ధ్యేయం. ఆయన మనసు మంచి గంధం - మాట మధురం - వాక్కు శాసనం! ఆ ఇంట అడుగుపెట్టటం నీ పూర్వపుణ్యం!''

అందులో ఏమాత్రం అతిశయంలేదని గ్రహించింది కౌముది. కానీ, ఆ మకుటం లేని మహరాజు తప్పుచేసినట్లుగా తలవంచుకుని వచ్చారొక రోజు... ఆ దృశ్యం....

* * *

ఒక సందెవేళ బాగా మబ్బులు పట్టి జడివాన కురవటానికి సిద్ధంగా ఉంది. అపరాధిలా తలవంచుకుని వస్తున్న శాస్త్రిగారికి పది గజాల వెనుక చేతులు కట్టుకుని వినయంగా నడుస్తున్న మరో బక్కచిక్కిన ఆకారం.

''కౌముదీ, శివా ఏడమ్మా?''


''ఆయన స్నేహితుడెవరో ఫ్యాక్టరీ పెడుతున్నాడట. దానికోసం జాగా కొన్నారట. సాక్షి సంతకాలు చెయ్యాలని వెళ్ళేరు మామయ్యగారూ.''

''కొండయ్యా - ఇలా వచ్చి కూచో.''

కౌముదికి దణ్ణం పెట్టి వారగా ఒదిగి కూర్చున్నాడతను.

'ఇతనెవరు మామయ్యగారూ.''

''కొండయ్య. ఇప్పుడే ఏదో జాగా కొన్నారని చెప్పున్నావ్ చూశావా. ఆ జాగాలో కొంత భాగం ఇతనిది కూడా ఉంది. పాక వేసుకుని చాలాకాలంగా అక్కడే ఉంటున్నాడు. ఎవరో ఆఫీసర్లు వచ్చి తన్ని తగిలేశారట. పాపం. వీధిన పడ్డాడు. మూడువేలు ఇచ్చి పంపమ్మా!'' అపరాధ క్షమాపణ స్తోత్రం చదువుకోవటంలో మునిగిపోయారాయన. మారుమాట్లాడకుండా మూడు వేలు తెచ్చి అతని చేతిలో పెట్టింది కౌముది. ఆ పేదవాడికి ఆనందబాష్పాలే తప్ప మాటల్లేవు. అతను వెళ్ళిపోయాడు.



కళ్ళు మూసుకుని కూర్చున్నారు శాస్త్రిగారు. వాన మొదలై జడివానగా మారింది. జరీ అంచుల పంచె తడిసి నేలకి అతుక్కుపోయింది. బాగా చీకటవుతూంది. ఆయన కదల్లేదు. సాహసించి లైటు వేసింది కౌముది. ''లేవండి, లోపలికి రండి...'' మరికాస్త సాహసించింది. ఆయన కళ్ళు విప్పేరు. ''కొండయ్యను బయటకు తన్ని తగిలేస్తున్నప్పుడు శివా కూడా అక్కడే ఉన్నాడటమ్మా!'' అదేదో చాలా మామూలుగా ఆయన చెప్తున్నట్లున్నా, కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నట్లనిపించింది కౌముదికి. కడుపులో దేవినట్లయి కళ్ళనీళ్ళు తిరిగాయి.

''పాపం చేస్తేనే కాదు - చేస్తున్నప్పుడు చూసినా పాపమే. మీరాయనకి గట్టిగా చెప్పండి.'' చిన్నపిల్లలా అంది. ఆయన మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని నిశ్చలంగా కూచున్నారు. అరగంట గడిచింది.

'జపం చేసుకుంటున్నారేమో! ధ్యానంలో ఉన్నారేమో!'

వర్షం వెలిసిపోయింది. ఉన్నట్టు చట్టున లేచారాయన. లోపలికి వెళ్ళబోతూ క్షణం ఆగి, ''కౌముదీ! శివాతో ఈ విషయం గురించి ఏమీ మాట్లాడకమ్మా'' అనేసి వెళ్ళిపోబోయారు. అది శాసనం! అప్పుడు కౌముదికి తెలియదు. ఇంకా కొత్తగా పెళ్ళయి ఆ ఇంటికి వచ్చిన రోజులవి. అందుకే అమాయకంగా అడిగింది ''ఎందుకని?''

''కొందరు శాపగ్రస్తులు. అంతే!'' వినవిసా నడిచిపోయారు. రాత్రి బాగా పొద్దుపోయి శివనాథ్ వచ్చేవరకు ఆ మాట గురించే ఆలోచిస్తూంది కౌముది.

'శాపగ్రస్తులు' అన్న మాట 'సంస్కారం లేనివాళ్ళు' అన్నట్టే వినపడుతూంది - ఎంత ఆలోచించినా.

చిత్రమైన స్వార్థం చెలరేగుతూంది. తన భర్తను ఆయన 'కుసంస్కారి' అన్నాడా? ఆ మాట జీర్ణంకావడంలేదు. ఒక ఉత్తమ సంస్కారి కొడుకు అలా ఎలా అవుతాడు? అందుకే రాత్రి గట్టిగా నిలదీసింది శివనాథ్‌ను.

శివనాథ్ ఎలాంటి జవాబు చెప్పలేదు. రాత్రి రోజూ మాదిరి సరససల్లాపాలతో కౌముది చెంతకు రాలేదు. చన్నీటితో తలమీద నుంచి స్నానం చేసి పట్టుపంచె కట్టుకుని దేవుడి పీఠం ముందు కూర్చున్నాడు.

కౌముది ఆనందం పట్టలేకపోయింది. మామగారి ముందు సగర్వంగా తలెత్తుకు తిరిగేలా చేస్తున్నాడు తన భర్త అనుకుంది. కానీ; ఆ ఆనందం అట్టేసేపు నిలవలేదు. తులం కర్పూరం వెలిగించి చెయ్యంతా బాగా కాల్చుకున్నాడు శివనాథ్. ఆపబోతే విదిలించి కొట్టేడు. అతని చర్య పశ్చాత్తాప సూచకంగాకాక చాలా ఘోరంగా, క్రూరంగా అప్పుడే అనిపించింది కౌముదికి. చేతిపుండు మానేసరికి దగ్గర దగ్గర నెలరోజులు పట్టింది.

''సాక్షి సంతకం పెట్టేనుగా మరి! నాకా శాస్తి కావల్సిందే!''

శివనాథ్ అన్నాడా మాట నవ్వుతూనే. కానీ, ఆ నవ్వులో ప్రతి అక్షరం వెనుకా ఉక్రోషమే ధ్వనించింది. సగర్వంగా మామగారి ముందు తలెత్తుకు తిరుగుతాననుకున్న కౌముది శిరస్సు అధఃపాతాళానికి పోయింది. 'శివోహం - శివోహం'- అంతా అర్థమైనట్లు కళ్ళతోనే తెలియజేస్తూ ప్రేమగా కోడలి తల నిమిరారాయన.

శివనాథ్ పనిచేస్తూన్న సంస్థవారు పంపితే ట్రెయినింగ్‌కని కలకత్తా వెళ్తున్నాడు. ఎప్పటి వాత్సల్యంతో, చిరునవ్వుతో కొడుకుని దీవించి పంపేరాయన. కౌముది తండ్రి దగ్గరకు వెళ్ళమన్నా వెళ్ళలేదు.

ఆ నెల రోజుల్లో ఆమె కొత్త ప్రపంచం చూసింది.

వేదశాస్త్ర పురాణేతిహాసాల సారాన్ని అతి సులువైన మాటలతో కోడలికి రంగరించి పోశారు శాస్త్రిగారు. కౌముది చాలా చాలా తెలుసుకుంది. తానెంతో ఎత్తులకెదిగి, శక్తిమంతురాలైన అనుభూతి కలిగింది.

* * *

''కౌముదీ!''

''ఆఁ.'' ఉలిక్కిపడ్డట్లయింది కౌముది. ''నిద్రపోతున్నావా?''

''ఛ..ఛ.. ఇప్పుడేం నిద్ర?''

''అంటే- ఇంకేదో తీవ్రంగా ఆలోచిస్తున్నావన్నమాట! శ్రీచరణ్ ఎవరని చెప్పాలా అనేగా''

''దానికింత యోచనెందుకు? వాడు నాకు దేవుడిచ్చిన కొడు ''

''అవు. ఇంకా ఎంతకాలం ఈ భ్రమలో బతకాలనుకుంటున్నావు? దేవుడిచ్చిన కొడుకట! ఆకాశం నుంచి ఊడిపడ్డాడా? పాతాళం చీల్చుకొచ్చాడా? ఎవడు? వీడెవడు?'' కౌముది రెండు భుజాలూ పట్టుకుని ఊపేస్తున్నాడు శివనాథ్.

''శివోహం - శివోహం.''

''వదలండీ, మామయ్యగారికి పళ్ళరసం ఇవ్వాలి.'' జాగ్రత్తగా విడిపించుకుని బయటపడింది కౌముది.

గట్టిగా తల విదుల్చుకున్నాడు శివనాథ్. తనకేం అవుతూంది? శ్రీచరణ్ నిమ్మకు నీరెత్తినట్లుంటాడు. ఇదెలా సంభవం? తనకేనా ఈ అశాంతి అంతా!

ఎలా పోతుందీ అశాంతి? పోనీ యాత్రలు చేసి వస్తే?

'యాత్ర!' శివనాథ్ మస్తిష్కం పాతిక సంవత్సరాల వెనక్కి దూసుకుపోయింది.

* * *

**కౌముది చూపుల కాఠిన్యం వెనుక మరుగున పడిపోయిందనుకున్న చిరునవ్వు వజ్రపు తునకలా తిరిగి ప్రత్యక్షం. ''బోధపడిందా?'' అన్నట్లు ముదలకిస్తున్నట్లున్నాయా చూపులు. అసహనంగా లేచి పచార్లు ప్రారంభించాడు.**

"కౌముదీ! ఓ కౌముదీ!" ఎప్పుడూ అలా పిలుస్తూ ఉండాలనే అనిపిస్తుంది శివనాథ్‌కి.

"మామా కోడళ్ళు ఏదో తీవ్ర చర్చలో ఉన్నట్టున్నారు!" చిరునవ్వుతో స్వాగతం పలుకుతూనే ఉత్తరం మడిచి కవర్లో పెట్టి మామగారికందించింది కౌముది.

"ఏమిటది? ఉత్తరమా? ఎక్కడి నుంచి?"

"మామయ్యగారి స్నేహితులు. కాశీయాత్రకు రమ్మని..."

"మీకు కాశీయాత్ర ఎందుకు నాన్నగారూ? మీరే అపరశంకరులు!"

"తప్పు శివా! ఆదిశంకరులే కాశీ క్షేత్రాన్ని దర్శించారు. అజ్ఞాన లేశాన్ని అక్కడే వదల్చుకుని అద్వైత సిద్ధాంతాన్ని ఆసేతు హిమాచలం చాటేరు. నేననగా ఎంత? ఈ యాత్రకు వెళ్ళాలి... వెళ్ళి తీరాలి." తండ్రి కంఠంలో ఎన్నడూ లేని కొత్త జీర ఏదో శివనాథ్‌ని ఆశ్చర్యపరచింది.

"జీవుడే దేవుడు - దేహమే దేవాలయం అనే నాన్నగారేనా కౌముదీ ఈ యాత్ర చేస్తానంటూన్నది. కొంపతీసి నువ్వు కూడా వెళ్ళిపోతున్నావేమిటి?"


"హుం, నాకెందుకండీ యాత్రలు? మీరు చేసే కర్మలలోని సగం ఫలితం నాదేగా."

"నేను పుణ్యకర్మలే చేయలేదనుకో! అప్పుడు?"

"ఆ పాపకర్మలోని సగం ఫలితాన్ని నేనూ అనుభవిస్తాను."

"నువ్వనుభవిస్తావంటే నా పాపకర్మని కూడా పుణ్యకర్మగా మార్చేస్తాడా భగవంతుడనిపిస్తూంది కౌముదీ నాకు!"

"తథాస్తు." శ్రీకంఠశాస్త్రిగారు కోడలి శిరసు మీద ఆపేక్షగా చేయివేశారు. "మీ దీవెనలుంటే నిజంగానే పాపాలు మమ్మల్నంటవు. దీవించండి మామయ్యగారూ!" ఆయన పాదాలంటింది కౌముది. ఆమె కళ్ళ నుంచి రెండు అశ్రుబిందువులు రాలేయి.



"కౌముదీ, నువ్వు చాలా ఇమోషనల్." నవ్వుకున్నాడు శివనాథ్. మరునాడు కాశీ యాత్రకని బయలుదేరారు శాస్త్రిగారు. ఆ పది రోజుల్లో భైరవయ్య అనే చిత్రమైన వ్యక్తి వచ్చాడా ఊరికి. మంత్రతంత్రాలతో, పూజలు పునస్కారాలతో భైరవయ్య జనాన్ని ఓ ఊపు ఊపటం మొదలెట్టేడు. అతని గారడీ విద్యలూ, చిట్కాలూ జనానికి ఆకర్షణీయంగా కనుపించాయి. వస్తువులు సృష్టించటం, తాయెత్తులివ్వటం, జబ్బులు నయం చేస్తానని వాగ్దానాలు చేయటం మనుమల్ని మత్తులోకి తోస్తున్నాయి.

ఊరవతల మామిడి తోపు దగ్గర గుడారం వేసుకుని రాత్రీ పగలూ హెూమాలూ యాగాలూ అంటూ హడావుడి చేస్తున్నాడు భైరవయ్య. క్రమంగా జనం తండోపతండాలుగా విరగబడి చేరుతున్నారక్కడ. దరిద్రం తీరాలని ఓవక్క ఏడుస్తూన్నవాళ్ళంతా ఉన్నంతలో తీసుకెళ్ళి అతని జోలె నింపుతున్నారు.

డబ్బు పోగుచేసుకుందికి భైరవయ్య ఇంకో కొత్త వల విసిరాడు వారం రోజుల తర్వాత - జనానికి దేవుణ్ణి చూపిస్తానని! మూఢనమ్మకాలు వదలాలన్న నాన్నగారి బోధలన్నీ ఏ గంగలో కలిసిపోయాయో. జనం చూశావా ఎలా తయారవుతున్నారో. నాన్నగారే ఉంటే ఈ భైరవయ్య ఆటలు ఒక్క రోజు కూడా సాగేవికావు. ఇంకే అనర్థం జరగకుండా ఆయన వచ్చేస్తే బావుండును." శివనాథ్ బాధపడ్డాడు.

"అనర్థం." అదోలా కౌముది నవ్వటం శివనాథ్‌కి నచ్చలేదు. "మీరెందుకండీ అంత కంగారుపడతారు? అనర్థాలన్నీ జరగకుండా ఆపేయటానికేం దేవుడా?"

"ఆయన అవతార పురుషుడని గొప్పగా చెప్పే నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది?"

చెక్కు చెదరని ఆభరణంలాంటి చిరునవ్వే అతనికి సమాధానం. ఓ రోజు తెల్లవారి లేచి మేడ దిగివచ్చేసరికి హాల్లో కూర్చున్న తండ్రిని చూడగానే సంతోషం వేసింది శివనాథ్‌కి. "ఎప్పుడొచ్చారు నాన్నగారూ?"

"రాత్రి. నువ్వు పడుకున్నావు. నేనే లేపవద్దన్నాను."

"ఆవేళప్పుడేం బండి ఉంది?"

"లైన్లు చెడి బళ్ళు సరిగా నడవటం లేదు. అందుకే కొంచెం తిప్పలు పడవలసివచ్చింది శివా."

"అయినా, ఇన్ని కష్టాలుపడి ఎందుకు నాన్నగారూ మీకీ యాత్రలు?"

"ఆ యాత్రల ఫలం మనకు దక్కాలనే ఆయనంత కష్టపడుతున్నారేమో. అంతేనా మామయ్యగారూ?"

"సర్వేజనా స్సుఖినో భవంతు." శాస్త్రిగారు లేచి వెళ్ళిపోయారు. శివనాథ్ కొంటెగా చూస్తూ కౌముది చెంతగా వచ్చి చటుక్కున కౌగలించుకుని, కొద్ది క్షణాలు ఊపిరాడకుండా ముద్దుల్తో ముంచెత్తేశాడు. "వదలండి. వేళాపాళా లేకుండా పొద్దున్నే ఏమిటీ పైత్యం?" చిరు అలకతో దూరం జరుగుతూన్న కౌముది ముఖం చూస్తుంటే అతనికి ప్రేమావేశం ఇంకా ఎక్కువవుతూంది. "అవునూ- యాత్రల ఫలితం ఏం దక్కాలి మనకు? నీకు అర్జంటుగా అమ్మాయో, అబ్బాయో కావాలంతేనా?" మత్తుగా పలుకుతూ మళ్ళీ దగ్గరకు రాబోతూంటే కౌముది అదోలా చూసింది శివనాథ్‌ని. ఆ చూపు పాలపొంగు మీద నీళ్ళ చిలకరింపే అయిందతనికి. "అసలు విషయం - భైరవయ్య గురించి మీరు మామయ్యగారితో చెప్పనేలేదే?"

**ఆయన పాదాలంటింది కౌముది. ఆమె కళ్ళ నుంచి రెండు అశ్రుబిందువులు రాలాయి. కానీ, యాత్రకని బయలుదేరారు శాస్త్రిగారు.**

"అన్నట్టు. అవును కదూ. ఇప్పుడే వస్తా." క్షణాల మీద శివనాథ్ దృష్టి మరొకవైపు మళ్ళిపోయింది.

భైరవయ్య ఆర్భాటమంతా శివనాథ్ చెప్తూంటే ఆసక్తిగా విన్నారు శాస్త్రిగారు. "దేవుణ్ణి చూపిస్తాడట. వీడి ఆట మీరే కట్టించాలి నాన్నగారూ!"

"జనం నమ్ముతున్నారా, శివా?"

"కొందరు నమ్ముతారు. కొందరు గోడమీది పిల్లివాటంగా ఉంటారు. ఇంత కాలం మీరు చేసిన బోధల ఫలితం ఇంతేననుకుంటే వింతగా లేదా నాన్నగారూ?"

"వింతేముంది శివా? మనిషి అంత సులువుగా మారిపోతే భగవంతుడిన్ని అవతారాలు ఎత్తవలసి వచ్చేదా చెప్పు. మహాపురుషులంతా చెప్పింది ఒక్కటే. అయినా, మనం ఎంత మారేం? చెప్పు నాయనా!" తండ్రి చూపు తన గుండెల్ని దూసుకుపోతూన్నట్టుగా అనిపించి అంతలోనే సర్దుకున్నాడు శివనాథ్.

"ఆ భైరవయ్య సంగతేమిటో నేను కనుక్కుంటానుండు. కారణం లేని కార్యం ఉండదు కదా!" ప్రశాంతంగా నవ్వేరు శాస్త్రిగారు.

"అమ్మయ్య. మీ బెంగ తీరిందా ఇక. అయినా, ఓ మాట చెప్పనా?" కొంటెగా నవ్వింది కౌముది.

"ఏమిటదీ?"

"దేవుణ్ణి చూపిస్తాడంటే - నాకూ చూడాలనే ఉందండీ!" కౌముది నవ్వులో ముత్యాలు దొర్లేయి.

"కౌముదీ!" కోప్పడుతున్నట్లుగా అన్నాడు శివనాథ్. "శ్రీకంఠశాస్త్రిగారి కోడలివై ఉండి నువ్వే ఇలాంటి మాటంటే ఇంకొకరిననుకోవలసిన పనేముంది?"

"ఏదో తమాషాకంటే అంత కోపం దేనికండీ? ఇంతకీ నేనిప్పుడు దేవుణ్ణి కొత్తగా చూడాలా చెప్పండి!" చూపుల్లో, ఆ మందహాసంలో 'నువ్వే నా దేవుడివి' అంటున్నట్లు తోచి ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు శివనాథ్. అంతలోనే అతని ముఖం ప్రసన్నంగా అయిపోయింది.

* * *

భైరవయ్య గుడారంలోకి శ్రీకంఠశాస్త్రిగారొక్కరే వెళ్ళేరు. శాస్త్రిగారొచ్చాక కొందరు చల్లగా జారుకున్నారు. కొందరు కుతూహలంతో ఏం జరుగుతుందా అని చూస్తున్నారు. అరగంట తర్వాత శాస్త్రిగారు బయటకు వచ్చేశారు. ఆయన ముఖం ఎప్పటిలా ప్రశాంతంగా ఉంది. ఏ భావమూ లేదు. అదే ఆయన ప్రత్యేకత.

గాలి తీసేసిన రబ్బరు బుంగలా తయారవుతాడనుకున్న భైరవయ్య మాత్రం చెక్కు చెదరకుండా అదే దర్పంతో, ఆయనతో సమానంగా నడచి



రావడం మాత్రం శివనాథ్‌లో అసహనం రేపింది.

'అంటే ఆయన వాడినేం మార్చలేకపోయారన్నమాట.'

భైరవయ్య పూనకం వచ్చినవాడిలా జనం ముందుకొచ్చాడు. "శాస్త్రిగారు నేను తాంత్రిక విద్యలు ప్రదర్శించి ప్రజల్ని మోసం చేస్తున్నానని నన్నీ ఊరొదిలి పొమ్మన్నారు. నాది మామూలు శక్తి కాదు. దైవశక్తి. నేను కొలిచిన కాలభైరవుడు, కాశీ విశ్వేశ్వరుడు నాకు తోడున్నారు. నేను మీకు దేవుణ్ణి చూపించగలను. నేనావని చెయ్యలేక పోతే మీరేశిక్ష వేసినా అనుభవిస్తాను. జై సాంబశివా! జై భైరవా!" విరగ బోసుకున్న జడలు కట్టిన జుట్టు, భయంకరంగా కుంకం బొట్టు, ఎర్రని బట్టలు, మెడలో పుర్రెలు, శంఖాల మాలలు ఊగుతూంటే శివాలెత్తి అరిచాడు.

అందరితోపాటు వింటూ కూచున్న తండ్రిని చూస్తే మొదటిసారిగా ఆశ్చర్యపోయాడు శివనాథ్. భైరవయ్య ప్రతిజ్ఞ ఊరంతా పాకింది. సాయం కాలానికి భైరవయ్య గుడారం చుట్టుపక్కలంతా జనం పోగయ్యారు. చీకటైన దగ్గర్నుంచీ తన గుడారంలో హోమం ప్రారంభించాడు భైరవయ్య. అతను వేసే కేకలు, మంత్రాలు - ఆ ఆర్భాటమంతా భయోత్పాతంగా ఉంది. ఒక పక్క డప్పుల మోతకి చెవులు చిల్లులు పడిపోతున్నాయి. హోమగుండంలో పోసి మంటపెడుతూన్న సామగ్రులు సృష్టించిన పొగలో ఎవ్వరికీ ఊపిరాడటం లేదు. చిరాగ్గా ఇంటికొచ్చాడు శివనాథ్. దేవుడి గదిలో నిశ్చలంగా సమాధ్య వస్థలో కనుపించారు శ్రీకంఠశాస్త్రిగారు. "వాడి పాచిక పారకుండా ఏమైనా చేస్తున్నారేమో కదా కౌముదీ?"

"దేవుణ్ణి చూపించటం మంచిదే అయితే, అలా జరగాలనే ప్రార్థిస్తున్నా రేమో." కౌముది ఎప్పటి చిరునవ్వే.

"ఛ. ఊరుకో. నువ్వు కూడా అలా మాట్లాడితే నాకు ఒళ్ళు మండుతుంది. ఇంతకీ, కౌముదీ! ఏమిటి వాడి ధైర్యం? దేవుణ్ణి ఎలా చూపిస్తాడు?"

"చూశారా. నన్నన్నారు కానీ, లోలోపల చూడాలన్న కుతూహలం మీకే ఎక్కువగా ఉంది." కౌముది నవ్వులో కవ్వింపు. "ఛ.ఛ. ఇలాంటి గారడీవాళ్ళని ఎంతోమందిని చూశాను."

"పోనీ, వీడేం చేస్తాడో చూద్దాం!" మళ్ళీ నవ్వబోయి శివనాథ్ ముఖం చూసి బలవంతాన ఆపుకుంది.

* * *

రాత్రి గడిచిపోతూంది. భైరవయ్య ఏకధాటిగా తన హోమ కార్య క్రమంలో మునిగి ఉన్నాడు. దేవుడూ లేడు, దయ్యమూ లేదు. కొందరు విసుక్కుని, తిట్టుకుని వెనుతిరిగిపోయారు. కొందరింకా ఆశ చావక కునికిపాట్లు పడుతున్నారు. పన్నెండు - ఒకటి - రెండు - మూడు - గంటలు దొర్లిపోతూనే ఉన్నాయి. పొగ, డప్పుల మోత ఆ ప్రదేశమంతా ఆక్రమించుకున్నాయి.

"ఇదుగో వెలిశాడు దేవుడు - చూడండి వెళ్ళి." గుడారం బయటకొచ్చి ఆనందంగా ఒక్క కేక పెట్టేడు భైరవయ్య. 'వీడి ముఖంలే' అనేసుకుంటూన్న వాళ్ళంతా నిద్రమత్తు వదుల్చుకుని విరగబడ్డారా వింత చూడ్డానికి.

హోమగుండం పక్కన లేత అరటాకుల్లో పసివాడు.

> **చీకటైన దగ్గర్నుంచీ తన గుడారంలో హోమం ప్రారంభించాడు భైరవయ్య. ఆ ఆర్భాటమంతా భయోత్పాతంగా ఉంది.**

బాలభానుడిలా వెలిగిపోతున్నాడు.

ఎవరి కళ్ళను వారు నమ్మలేకపోతున్నారు.

కేవుమని గుక్క పట్టి ఏడుస్తున్నాడా పసికందు.

కొందరు వింత చూసిపోయారు. కొందరు పడిపడి దండాలు పెడుతున్నారు. పిచ్చిగా ఆనందబాష్పాలు రాలుస్తున్నారు కొందరు. వర్ణనాతీతంగా ఉందా ప్రదేశం.

దేవుణ్ణి చూపిస్తానని ఇంత కోలాహలం సృష్టించిన భైరవయ్య మాత్రం ఇంకెవరి కళ్ళా పడలేదు.

'అమ్మో! వాడేదో గారడీ చేసిపోయినట్లున్నాడు. వీడు గారడీ పిల్లడే! ఎక్కువ సేపు ఉండోడు' అన్నారొకరు.

పొద్దెక్కింది. పిల్లవాడు మాత్రం మాయం కావటంలేదు.

గుక్కపట్టి ఏడుస్తూనే ఉన్నాడు. దేవుడిని చూడగానే ఆనందంతో పిచ్చిగా ఏడ్చిన వాళ్ళు గుట్టుగా తప్పుకున్నారు. 'వీడేం దయ్యపు పిల్లడో - ముట్టుకుంటే ఏమి అనర్థం వస్తుందో!' అని బాహాటంగా అనేశారొకరు.

ఆ అనాథ పిల్లవాడలా ఏడుస్తూనే ఉన్నాడు.

"ప్రత్యక్షమై, వరాలిచ్చేసి అంతర్ధానమైపోతేనే వాడు దేవుడమ్మా. జనానికిలాంటి దేవుడక్కర్లేదు. నీకు దేవుడిచ్చిన వరప్రసాదంగా స్వీకరించు తల్లీ" అంటూ అరటాకుల్లో చుట్టుకుపోతూన్న పసివాడిని స్వయంగా చేతుల్లోకి తీసుకుని కోడలి ఒడిలో ఉంచారు చూడటానికి వచ్చిన శ్రీకంఠశాస్త్రిగారు.

నిస్సంకోచంగా కళ్ళకద్దుకుంది కౌముది.

'దేవుడూ కాదు పాడూ కాదు. ఆ పిల్లాడెవరో ఏమిటో! గారడీవాడు గమ్మత్తు చేసిపోతే కులం గోత్రం చూడకుండా ఏకంగా ఇంటికి తెచ్చుకున్నారు శాస్త్రిగారు. ఏదో అరిష్టం' అని విడ్డూరంగా చెప్పుకున్నారంతా. రోజులు గడుస్తున్నకొద్దీ వెలివేసినట్లు చూడటం కూడా ప్రారంభించారు. శాస్త్రిగారు ఖాతరు చెయ్యలేదు. ఆ పిల్లవాడిని ఇంట్లో ఉంచుకుని ఇంకా అవమానాలెదుర్కోవటం ఇష్టంలేక తండ్రికెలా నచ్చ జెప్పాలా అనుకుంటూ వచ్చాడోనాడు శివనాథ్.

అప్పుడొకసారి శాస్త్రిగారి వాక్కు శాసనమయింది.

"శివా! ఈ పసివాడికి అమ్మ దొరికింది. నాన్న కావాలంటున్నాడు. అందుకోరా." శివనాథ్ ఏమీ అనే అవకాశం ఇవ్వకుండానే అపురూపంగా తెచ్చి వాడిని కొడుకు ఒడిలో పడుకోబెట్టేరు. కౌముది ఓరగా చూసి అతి తియ్యగా నవ్వుతూంది. అమృతం పంచిన వేళ మోహిని అలాగే నవ్వి ఉంటుందని పించింది శివనాథ్‌కి. సర్వం మరచి "సరే - నాన్నగారూ" అనేశాడు.

* * *

"ఏమండీ."



"ఆఁ?" ఉలిక్కిపడ్డట్టయాడు శివనాథ్

"నిద్రపోతున్నారా?" "ఛ...ఇప్పుడేం నిద్ర?"

"అంటే తీవ్రంగా ఆలోచిస్తున్నారన్నమాట. మీ ఆలోచన ఎప్పుడూ ఒక్కటేగా. నాటికీ నేటికీ శ్రీచరణ్ ఎవరన్నదేగా మీ బాధ?" కౌముది ఎప్పటిలా లేదు.


'ఈ కంఠం కౌముదిదేనా?' ఆశ్చర్యంగా చూస్తున్నాడు. 'ఎప్పటికీవ్యక్తి తనకు అర్థమౌతుంది?'

"చెప్పండి. అదేగా మీ జీవిత సమస్య."

మళ్ళీ వాడి ప్రసక్తే. తనకు శాంతి లేదా జీవితంలో? "అవునూ...అవును. అది జవాబులేని ప్రశ్న. నన్ను వేధించకు."

"జవాబులేని ప్రశ్న కాదండీ అది. తల్లి కనని జీవి ఎక్కడైనా ఉంటుందా? అవతారమూర్తులు కూడా తల్లి కడుపు నుంచే పుడితే శ్రీచరణ్ అయోనిజుడు, స్వయంభువుడు ఎలా అవుతాడు? మీలాగే, నాలాగే వాడూ ఓ తల్లి కన్న బిడ్డడు. నరేనా!".

"ఆమాత్రం తెలియనంత మూర్ఖుడినికాను. కానీ, పని కట్టుకుని నువ్వెందుకు చెప్తున్నావా మాట?" అసహనం అంచులు దాటింది. "మీకు బ్రహ్మోపదేశం చేసిన తండ్రి ఈవాళ మీకా రహస్యం చెప్పమన్నారు కనుక..."



"అంటే - అసలు సంగతి ఆయనకీ, నీకూ..."

"అంతేకాదు - శ్రీచరణ్‌కి కూడా..."

బుస్సున మహానాగులా లేచాడు శివనాథ్.

"అయితే...నన్ను...నన్ను మీరంతా కలసి మోసం చేశారన్నమాట. ఎందుకు? చెప్పు....చెప్పు...చెప్పు."

పిడుగులు పడి పడి ఆగిపోయాయి. భీకర నిశ్శబ్దం.

"సౌదామిని ఎవరు? ముందు మీరు చెప్పండి." అతి లాలనగా శరదృతువులో వెన్నెలంత చల్లగా ఉంది కౌముది కంఠం. పదునైన బాకు గుండె చీల్చుకుని లోపలికి దిగిపోతున్నట్లుంది. బుసలు కొడుతున్న మహానాగు ఒక్కసారి పాతాళానికి తలవాల్చేసింది. శివనాథ్ హఠాత్తుగా నోరు పడిపోయినవాడిలా చూశాడు. "నే చెప్పనా? సుమారు పాతిక సంవత్సరాల కిందట ట్రెయినింగ్‌కని మీరు కలకత్తా వెళ్ళినప్పుడు మీకు పెళ్ళయిందని, మీ ప్రాణానికి నేనున్నానని తెలియక మీ వెంటపడ్డ మెరుపు తీగ."

మెరుపులు చూడలేనట్లుగా శివనాథ్ కళ్ళు వచ్చ బారిపోతున్నాయి. 'ఒక్కసారి అంతర్ధానమయ్యే శక్తి ఉంటే ఎంత బాగుండును' అనిపిస్తుంది.

"మీరు తప్పు చెయ్యలేదండీ. ఎన్ని గుండెలుండాలి మిమ్మల్ని ఆ మాట అనటానికి. కలసివచ్చిన అవకాశాన్ని అందంగా వాడుకున్నారంతే. ఆ స్వల్ప విషయాన్ని మీరప్పుడే మరచిపోయారు. ఆ తరువాత ఏం జరిగిందో మీకు తెలియదు. కానీ, ప్రకృతి విధించే శిక్ష ఆడదానికేగా. మీ వివరాలు, నిజస్వరూపం తెలిసేసరికి పరిస్థితి చేయిదాటిపోయింది. ఓ వజ్రపు తునకని కని భూమ్మీద పడేసి, తన పేరు సార్థకం చేసుకుంటూ మాయమైపోయిన ఆ మెరుపు తీగ - మీ నాన్నగారి చిన్ననాటి స్నేహితుడి కూతురు - సౌదామిని. ఇప్పుడైనా జ్ఞాపకం వచ్చిందా?" శివనాథ్‌లో చలనం లేదు. గాలి స్తంభించిపోయినట్లుంది.

"పుట్టెడు దుఃఖంతో ఆ పిల్ల తండ్రి రాసిన ఉత్తరం అందుకుని, కాశీయాత్ర పేరుతో వెళ్ళి మనవడిని తెచ్చుకున్నారాయన. నిజం చెప్పలేక, అన్యాయాన్ని సహించలేక నలిగిపోతున్న వేళ కూటి కోసం కోటి విద్యలు నేర్చిన భైరవయ్య ఆపద్బాంధవుడిలా వచ్చాడు. పరిస్థితి నర్థంచేసుకున్న ఆ మంచి మనిషి అందించిన సహకారంతోనే దైవ స్వరూపంగా ఈ ఇంటికి వచ్చాడండీ శ్రీచరణ్."

ఒకనాటి డప్పుల మోత, హోమగుండంలోని పొగలు, సెగలు ఇప్పుడు ఊపిరాడకుండా చేస్తున్నాయి శివనాథ్‌ని.

"వాడు మీ కొడుకండీ, మీ కన్న కొడుకు." కౌముది కంఠం భూసభోంత రాళాలు చీల్చుకుని వస్తూంది. "అయితే, ఇంతవరకూ మీకెందుకు చెప్ప లేదని కదూ మీ సందేహం? అందుకు మీరే బాధ్యులు."

కొరడాదెబ్బలు ఒకదానిమీదొకటి పడుతున్నాయి.

"మీది చిత్రమైన మనస్తత్వమని మీకూ తెలుసు. కానీ, మార్చుకుంది కేనాడూ ప్రయత్నించలేదు. ఎవరైనా తప్పు చేస్తే దిద్దుకుంటారు. క్షమాపణ కోరతారు. మీరలా కాదు. మీరు తప్పు చేసినట్లు ఎవరైనా మందలిస్తే మిమ్మల్ని మీరు క్రూరంగా శిక్షించుకుంటారు. పశ్చాత్తాపంతో కాదు, ఉక్రోషంతో. అది మీకంటే ఎదుటివారిని ఎక్కువగా బాధిస్తుంది. పెళ్ళయిన కొత్తలో మీరు కర్పూరం వెలిగించి చెయ్యి కాల్చుకున్నప్పుడే నాకు బోధపడింది. చిన్నప్పుడు బళ్ళో తోటి పిల్లవాడి పుస్తకం ఎందుకు చింపావని కోప్పడితే మీ మొత్తం పుస్తకాల్ని చింపి పోగులు పెట్టిన దగ్గర్నుంచి, కాలేజీ గొడవల్లో ఎందుకు తలదూర్చావని అంటే నిద్ర మాత్రలు మింగినవరకు ఎన్నని? ఎన్నని? ఆ తండ్రి మీతో ఎంత నరకం అనుభవించారో నాకు తెలుసండీ! అందుకే మీరు చేసిన తప్పునిక మీతో చెప్పకుండా విషంలా ఆయనే మింగేరు. శ్రీకంఠుడు కదా మరి!"

'ఈ కౌముది ఇరవై ఆరు సంవత్సరాలు తనతో కాపురం చేసిన తన భార్యేనా? మరి ఇంత కొత్తగా, వింతగా కన్పిస్తూందేం? అమ్మో! ఎలా చూస్తూందో భయంగా రెండడుగులు వెనక్కి వేశాడు శివనాథ్.

"శ్రీరామచంద్రుణ్ణి అన్నట్టే ఇంతకాలం నన్ను చూసిన ఈ పిచ్చి దానికివన్నీ ఎప్పుడో తెలుసా? తెలిసే నన్ను దేవుడిలా చూస్తూందా? మోసం చేసిన తండ్రినని తెలిసి కూడా శ్రీచరణ్ నన్ను తండ్రిగా ఎలా గౌరవించగలుగుతున్నాడు? అని అనుమానం వస్తూంది కదూ మీకు."

'అవును...అవును...అవును... ఇదెలా సంభవం!' ఘోష పెడుతూంది శివనాథ్ మనస్సు.

"అది ఎవరి గొప్పతనం కాదండీ! మీరు చేసుకొన్న పుణ్యం. మీరు సంపాదించుకున్న అర్హత."


'పుణ్యం! అర్హత!' తన జీవితంలో ఇవెక్కడి పదాలు?

"అదే - శ్రీకంఠశాస్త్రిగారి కొడుకుగా పుట్టడం!"

శివనాథ్‌లో అవిద్య అంతమైపోతూన్న అనుభూతి.

"మీరు చేసింది మామూలు తప్పు కాదండీ! ఘోరాపరాధం. మీ పాపానికి నిష్కృతి లేదు. విషనాగులా బుసలుకొట్టే మీలోని దురహంకారం, తామసం మిమ్మల్ని మీరెలా హింసించుకోవాలని శాసిస్తున్నాయో పోయి పాటించండి. వెళ్ళండి." భద్రకాళిలా అరిచింది కౌముది. కొయ్యబారి నిల్చున్న శివనాథ్ శరీరం నెమ్మదిగా కదిలింది. మేడ మెట్లెక్కింది. బాత్‌రూంలో దబదబ నీళ్ళు పడుతూన్న శబ్దం. 'ఏం చేస్తున్నాడు చెప్మా.' బితుగ్గా గడియారం కేసి చూస్తూంది కౌముది. పది నిమిషాల తర్వాత శబ్దం ఆగిపోయింది. అతని గదిలోకి పోయి తలుపులు మూసుకున్నాడు. మరో పావుగంట! 'అమ్మో! గదిలో ఒక్కడూ ఏం చేస్తున్నాడో!' తలుపులు తెరుచుకున్నాయి. 'అమ్మయ్య!' శివనాథ్ మేడ మెట్లు దిగుతున్నాడు. కళ్ళు నులుముకుని చూసింది కౌముది.

నొసట విభూతి రేఖలు - మెడలో రుద్రాక్షలు - తెల్లని బట్టల్లో. తన పెళ్ళయిన కొత్తలో మామగారి రూపం కళ్ళ ముందు మెదిలింది. తిన్నగా తండ్రి ఉన్న గదిలోకి వచ్చాడు శివనాథ్. ఏకధారగా కురుస్తున్న



కన్నీటిని తుడుచుకునే ప్రయత్నంలో కూడా లేడతను.

"విహితమ విహితం వా సర్వమే తత్ క్షమస్వ. శివశివ కరుణాబ్దే..." అతని కంఠం పెనుగాలికి చిగురాకులా వణకిపోయింది. కౌముదికి నేత్ర పర్వంగా ఉందా దృశ్యం. శాప విమోచనం అయిన గంధర్వుడిలా కనుపిస్తున్నాడిప్పుడు శివనాథ్. మసకబారిపోతూన్న కళ్ళను చిన్నపిల్లలా తుడుచుకుని చూస్తూంది. రెండు చేతులూ జోడించి తండ్రి పాదాల దగ్గర నిల్చున్నాడతను.

"ప్రతిసారీ దురహంకారంతో...నన్ను...నేను... హింసించుకున్నాను. ఈసారి శిక్ష...మీరు...మీరు వెయ్యండి...నాన్నగారూ." వణకుతున్న కంఠాన్నీ, చేతుల్నీ అదుపులో పెట్టుకుంటూ తండ్రి రెండు పాదాలపై చెయ్యివేసిన శివనాథ్ విద్యుదాఘాతం తగిలినవాడిలా కొయ్యబారిపోయాడు.

"శివోహం" అంటూ దిక్కులు మార్మోగుతున్నాయి.

అంతే. ఇక ఆ మాట ఆ నోట రాదు!

"ఇందుకా ఈ రోజు చెప్పమన్నది. ఇది చాలా అన్యాయం." పెనుకేక పెట్టింది కౌముది.

క్షమాపణ చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా చాలా చిత్రమైన శిక్షే వేశారు కొడుక్కి శ్రీకంఠశాస్త్రిగారు. ■

తండ్రి రెండు పాదాలపై చెయ్యివేసిన శివనాథ్ విద్యుదాఘాతం తగిలిన వాడిలా కొయ్యబారిపోయాడు.